క్లుప్తంగా

మహిళలకు రక్షణగా భరోసా కేంద్రం



బాలికలతో ఎస్‌ఐ, పాఠశాల ఎస్‌ఓ, ఉపాధ్యాయులు

చిన్నకోడూరు(సిద్దిపేట): బాలికలు, మహిళలకు సహాయ కేంద్రంగా భరోసా కేంద్రం పని చేస్తుందని ఎస్‌ఐ శివానందం అన్నారు. మండల పరిధిలోని అల్లీపూర్ కేజీబీవీలో భరోసా కేంద్రం, షీ టీమ్స్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలకు ఏదైనా సమస్య వస్తే భరోసా కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. మహిళల రక్షణకు షీటీమ్స్ పని చేస్తున్నాయన్నారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యం ఏర్పాటు చేసుకొని ముందుకు సాగితే అద్భుత ఫలితాలు సాధిస్తారన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శారద, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

హద్దురాళ్ల తొలగింపు



హద్దురాళ్లను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలో అనుమతులు లేకుండా చేసిన వెంచర్లలోని హద్దురాళ్లను సోమవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా చేసిన వెంచర్లలో ప్రజలు ఎవరూ ప్లాట్లు కొనుగోలు చేయొద్దని, ఒకవేళ కొనుగోలు చేస్తే వాటికి నిర్మాణ అనుమతులు రావని సూచించారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి

డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు ఫిర్యాదు

గజ్వేల్: కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న ప్రజ్ఞాపూర్‌లోని రాణే ఫ్యాక్టరీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆ పరిశ్రమ బీఎంఎస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీశైలం, వర్కింగ్ ప్రెసిడెంట్ సల్ల శ్రీనివాస్‌లు సంగారెడ్డిలోని డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంపెనీ యాజమాన్యం సీఐటీయూతో కుమ్మక్కై భద్రతా ప్రమాణాలను ప్రశ్నిస్తున్న కార్మికులను వ్యక్తిగతంగా పిలిపించుకొని వేధిస్తుందని ఆరోపించారు. ఈ వ్యవహారంపై కార్మిక శాఖ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

అక్కన్నపేట(హుస్నాబాద్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నాయని, కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి జరిగిందని మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ఆరోపించారు. అక్కన్నపేట మండలం గండిపల్లి గ్రామంలో సోమవారం పల్లె పల్లెకు ప్రవీణ్ అన్న.. గడపగడపకూ కాంగ్రెస్ నినాదంతో ఇంటింటికీ తిరుగుతూ తాము అధికారంలో వచ్చిన తర్వాత అమలు చేసే సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ శివయ్య, పీసీసీ సభ్యుడు లింగమూర్తి, మండల అధ్యక్షుడు అయిలయ్య, అక్కన్నపేట సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, గుడాటిపల్లి సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వినతి

కొమురవెల్లి(సిద్దిపేట): తమ సమస్యలు ఈ నెల 5 తేదీ వరకు పరిష్కరించకుంటే 6 నుంచి సమ్మెకు వెళ్తామని మండల పరిధిలోని జీపీ కార్మికులు అన్నారు. సోమవారం సీపీఎం జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి ఆధ్వర్యంలో కార్మికులు ఎంపీడీఓ అనురాధకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బ్రహ్మండ్లపల్లి పరశురాములు, సాయిలు, తాడూరి రాజలింగం, నర్సింలు, శ్రీనివాస్, రవీందర్, కృష్ణ, ఉప్పలమ్మ, పోశమ్మ, కళ, యాదగిరి, రాజు, రవీందర్, కనకయ్య, సురేశ్, గోకుల్, పద్మ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆరోపణలను ఖండిస్తున్నాం

చేర్యాల(సిద్దిపేట): జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తనపై చేస్తున్న ఆరోపణలు తప్పని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నానని మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణ కేంద్రంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే కూతురు తుల్జా భవాని చేస్తున్న ఆరోపణలతో తనకు ఎలాంటి సంబంధం లేదని, కూతురుతో మాట్లాడి పరిష్కరించుకోవాల్సిన ఎమ్మెల్యే నాపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. వచ్చే ఎన్నికల్లో జనగామ నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా సర్కారు బడులు

- మన ఊరు–మన బడితో పాఠశాలల్లో అన్ని వసతులు
- మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

బెజ్జంకి(సిద్దిపేట): మన ఊరు–మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా నిర్మించి నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు మానకొండూర్ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మన ఊరు–మన బడిలో 73.50 లక్షలతో నిర్మించిన బెజ్జంకి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిథిలావస్థలో ఉన్న పాఠశాలల మరమ్మతులు, నూతన భవనాలను కోట్ల రూపాయలు వెచ్చించి కార్పొరేట్ పాఠశాలల్లో ఉన్న విధంగా మౌలిక వసతులు కల్పించిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ బడుల్లో చేరి బలోపేతానికి కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ చొరవతో ఆంగ్ల భాషల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, కనగండ్ల కవిత, ఎంపీడీఓ రాము, ఎంఈఓ పావని, ఏఎంసీ చైర్మన్ కచ్చు చంద్రకళ, స్థానిక సర్పంచ్ ద్యావనపెల్లి మంజుల, ఎంపీటీసీ గుబిరె శారద, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, హెచ్‌ఎం శంకరాచారి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం



మహిళకు కుట్టుమిషన్‌ను అందజేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

గజ్వేల్‌రూరల్: లయన్స్ క్లబ్ ద్వారా చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ రీజియన్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ, సెక్రటరీ సంజయ్‌గుప్తా, ప్రతినిధులు రాంఫణిధర్‌రావు, పరమేశ్వరాచారీల ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పట్టణంలోని లక్ష్మణ్ గార్డెన్స్‌లో మహిళలతో నూతనంగా ఏర్పాటైన లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ మహతితో పాటు లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ, లయన్స్ క్లబ్ ఆఫ్ ప్రజ్ఞ, లయన్స్ క్లబ్ ఆఫ్ జగదేవ్‌పూర్ మిత్ర, లయన్స్ క్లబ్ ఆఫ్ విజ్‌డమ్, లయన్స్ క్లబ్ ఆఫ్ రాయపోల్ క్లబ్‌లకు సంబంధించిన నూతన చైర్మన్లు, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ లయన్ గంధాని శ్రీనివాస్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ.. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు అండగా నిలుస్తూ వారికి సహాయ సహకారాలు అందించడంపై అభినందించారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన లయన్స్ క్లబ్ ఆఫ్ గజ్వేల్ స్నేహ చైర్మన్ నేతి శ్రీనివాస్ నిరుపేద మహిళలకు జీవనోపాధి కోసం కుట్టు మిషన్‌ను అందజేయగా, మరో మహిళకు రూ.5వేల నగదును అందించారు. కార్యక్రమంలో లయన్ శ్యామ్‌కుమార్, శ్రీనివాస్, ప్రవీణ్, డాక్టర్ లింగంలతో ఆయా లయన్స్ క్లబ్‌ల ప్రతినిధులు, నాయకులు ఉప్పల మెట్టయ్య, నంగునూరి సత్యనారాయణ, గోలి సంతోష్, సయ్యద్‌మతిన్, హైదర్‌పటేల్, ఎల్లం రాజు, చంద్రశేఖర్, నాగేందర్, సుమలత, పరమేష్, నాగరాజు, ఎలియాస్‌రావు, శ్రీనివాస్‌గౌడ్, బాలముత్యం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

జిల్లా వ్యాప్తంగా సోమవారం గురుపౌర్ణమి పురస్కరించుకొని షిరిడీ సాయిబాబా, సత్యసాయి మందిరాల్లో భక్తుల సందడి నెలకొంది. ఉదయం నుంచే భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు, ప్రసాదాల వితరణ చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగు ఏర్పాట్లు చేశారు.



హుస్నాబాద్: హారతి తీసుకుంటున్న భక్తులు



గజ్వేల్‌లో కుంకుమార్చన చేస్తున్న మహిళలు



బెజ్జంకి షిరిడీ సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

సమస్యలు పరిష్కరించాలి



మంత్రి హరీశ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

కొండపాక(గజ్వేల్): సమస్యల పరిష్కారం కోసం ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక వైద్యారోగ్య, పంచాయతీ రాజ్‌శాఖల మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావులను కలిసి వినతిపత్రం అందించారు. రోజు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు క్షేత్ర స్థాయిలో పనులు చేస్తున్నారని, శ్రమకు తగ్గ వేతనాలు రావడం లేదని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి హరీశ్‌రావు వినతి పత్రంపై సంతకం చేసి ప్రిన్సిపల్ సెక్రటరీకి పంపిస్తూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూడాలని ఫోన్ ద్వారా వివరించారు. మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు అడ్వాన్స్ పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు అమరేందర్‌రెడ్డి, జిల్లా నాయకులు స్కైలాబ్, దువ్వాల యాదగిరి, భాగ్యలక్ష్మి, ఆనంద్, నారాయణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం అందించాలి

వర్గల్(గజ్వేల్): భూములు లాక్కొని సరైన పరిహారం ఇవ్వకుండా రైతులను ఏడ్పిస్తే ఉసురు తప్పదని, అలాంటి ప్రభుత్వం కుప్పకూలుతుందని యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి అన్నారు. వర్గల్ మండలం అవుసులోనిపల్లి వద్ద భూనిర్వాసితుల దీక్ష సోమవారం 11వ రోజుకు చేరగా ఆమె దీక్ష శిబిరం సందర్శించి సంఘీభావం ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ రైతుల పక్షాన ఉండి పోరాటం కొనసాగిస్తుందన్నారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు నందు, జకీర్, భూనిర్వాసిత రైతులు మాజీ ఎంపీటీసీ యాదయ్య, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

రాజశేఖర్‌రెడ్డికి డాక్టరేట్

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన పోతిరెడ్డి రాశేఖర్‌రెడ్డి లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలోని మిట్టల్ స్కూల్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం నుంచి డాక్టరేట్ పొందారు. పరిశోధనకు సంబంధించిన మౌఖిక పరీక్ష శనివారం నిర్వహించారు. అసోసియేట్ ప్రొఫెసర్ మిథిలేష్ పాండె, శబం గులాటీల పర్యవేక్షణలో సోషల్ మీడియా విభాగంలో ఏస్టడీ ఆన్ ఎఫెక్ట్ ఆఫ్ ఎలక్ట్రానిక్ వర్డ్ ఆఫ్ మౌత్ ఆన్ కస్టమర్ గ్రీన్ పర్చేస్ ఇంటెన్షన్ అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని ఆయన రూపొందించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. తన పీహెచ్‌డీ పరిశోధన సోషల్ మీడియాలో ప్రమోషన్ చేసే సంస్థలకు గ్రీన్ ప్రొడక్ట్ కొనాలనుకునే వినియోగదారులకు ఉపయోగకర సమాచారం లభిస్తుందన్నారు. తన పరిశోధనకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): చిన్ననాటి నుంచే క్రీడల్లో రాణించాలనుకునే విద్యార్థులకు స్పోర్ట్స్ స్కూల్ ఒక మంచి అవకాశమని ఎంపీపీ మాలోతు లక్ష్మి అన్నారు. అక్కన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం మండల స్థాయి ప్రాంతీయ క్రీడా పాఠశాలల ఎంపిక పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులను చదువులతో పాటు క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. ఎంతో మంది స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడ్డారన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ నర్సింహారెడ్డి, హెచ్‌ఎం గంగాధర్, రంగనాయక్, ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి, సర్పంచ్ సంజీవ్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటనర్సయ్య, మాజీ జెడ్పీటీసీ మాలోతు భీలునాయక్, పీఈటీ శ్రీరాం, సీఆర్పీ శ్రీనివాస్ ఉన్నారు.

భారతీయ సంస్కృతికి గురువులే మార్గదర్శకులు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గురువులను సన్మానిస్తున్న పండితులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు గురువులే మార్గదర్శకులు అని సంతాన మల్లికార్జునస్వామి పీఠాధిపతి డాక్టర్ చెప్పెలా హరినాథశర్మ అన్నారు. గురుపౌర్ణమి, వ్యాసపూర్ణిమల సందర్భంగా వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో సిద్దిపేటలో గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం కొండపాక మండల విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, సంగీత విద్వాంసుడు శశిధరశర్మ, ఉద్యోగ, ఉపాధ్యాయ మహిళా తరుణి అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు లక్కిరెడ్డి విజయ, విద్య, యోగ మహర్షి గంగాపురం శ్రీనివాస్, నాట్య గురువు భవాని, యోగా శిక్షకురాలు తోట సంధ్యలను సన్మానించారు.

సిద్దిపేటజోన్: వ్యాస మహర్షి సొసైటీ ఆధ్వర్యంలో ఎన్జీవో భవన్‌లో గురువులను సన్మానించారు. గురువు దైవంతో సమానమని పేర్కొన్నారు. అంతకుముందు వ్యాస మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం యోగా శిక్షకులు మనోహర్, నగేశ్, అశోక్, అంజయ్య, కష్టమూర్తిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సురేందర్‌రెడ్డి, శ్రీహరి, రవి, కనకరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పద్మశాలి భవన్‌లో హార్ట్ ఫుల్ నెస్ ఆధ్వర్యంలో పలువురు గురువులను సన్మానించారు.

బూత్ కమిటీలు శక్తివంతంగా నిర్మించుకోవాలి



హుస్నాబాద్: మాట్లాడుతున్న నాయకులు



సిద్దిపేటజోన్: ఇంటింటి ప్రచారంలో నాయకులు

హుస్నాబాద్: మేరా బూత్ సబ్ సే మజ్ బూత్ కార్యక్రమంలో భాగంగా సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో బీజేపీ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్‌బాబు అధ్యక్షతన పట్టణ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తమిళనాడు రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకుడు, అల్పకాలిక విస్తారక్ సబే ఇంద్రన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సబే ఇంద్రన్ బూత్ కమిటీల ప్రక్రియ, పార్టీ బలోపేతానికి ఏ విధంగా కృషి చేయాలో సూచనలు చేశారు. బూత్ కమిటీలను శక్తివంతంగా నిర్మించుకుంటే బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. 2024లో జరిగే ఎన్నికల్లో దేశంలో మరోసారి నరేంద్ర మోదీ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడటం ఖాయమన్నారు. సమావేశంలో సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు మెంబర్ లక్కిరెడ్డి తిరుమల, జిల్లా కోశాధికారి శ్రీనివాస్, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి స్వరూప, నాయకులు ఉన్నారు.

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలో ఇంటింటా బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, అల్పకాలిక విస్తారక్ గోవిందరాజు హాజరయ్యారు. బీజేపీ అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇంటింటా తిరుగుతూ ప్రజలకు వివరించారు. 27 గ్రామాల్లో 50 పోలింగ్ బూత్ కమిటీలు, కార్యవర్గ సమావేశాలను జయప్రదం చేసిన మండల అధ్యక్షుడు ఖమ్మం వెంకటేశం, గోవిందరాజులను నాయకులు, కార్యకర్తలు సన్మానించారు.

ములుగు(గజ్వేల్): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇంటింటికీ బీజేపీ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ రేఖ పేర్కొన్నారు. బండతిమ్మాపూర్ గ్రామంలో మండల అధ్యక్షుడు రమేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బైక్‌ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, నాయకులు వినోద్, వెంకటేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం

సిద్దిపేటజోన్: కేంద్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ప్రశాంత్‌నగర్ 132 పోలింగ్ బూత్ పరిధిలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ పథకాలను వివరించారు. ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు మద్దతు ఇస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, శ్రీనివాస్, మార్కండేయ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు మెస్ చార్జీలు పెంచాలి

గజ్వేల్‌రూరల్: గురుకుల, హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఈ విద్యాసంవత్సరం నుంచే డైట్ చార్జీలను పెంచాలని డీబీఎఫ్(దళిత బహుజన ఫ్రంట్) జాతీయ కార్యదర్శి పి. శంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గిరిజన హాస్టల్‌ను సోమవారం సందర్శించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకనుగుణంగా డైట్ చార్జీల పెంపునకు ప్రభుత్వం నిర్ణయించినా ఇంకా అమలు చేయకపోవడం సరికాదన్నారు. గిరిజన హాస్టల్‌లో బాత్‌రూమ్‌లు సరిగా లేవని, ప్రహరీ లేకపోవడంతో పాములు వచ్చే ప్రమాదముందన్నారు. భవనం శిథిలావస్థకు చేరుకున్నందున ఈ హాస్టల్‌ను ఎడ్యుకేషన్ హబ్‌కు తరలించాలన్నారు. కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, నాయకులు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక

గజ్వేల్‌రూరల్: బాసరలోని ట్రిపుల్ ఐటీకి గజ్వేల్‌లోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం రుక్మిణి తెలిపారు. సీహెచ్. జాహ్నవి, బి.అమూల్య, డి.ప్రతిజ్ఞలు సీటు సాధించడంపై పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించింది.

హుస్నాబాద్ మోడల్ స్కూల్ నుంచి..

హుస్నాబాద్: హుస్నాబాద్ పట్టణంలోని మోడల్ స్కూల్ నుంచి 10మంది విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీంతో ఆయా విద్యార్థులకు పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని వింజపల్లి ప్రభుత్వ పాఠశాలలో చదివిన నలుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం దేవేందర్‌రెడ్డి తెలిపారు. వింజపల్లి గ్రామానికి చెందిన చిట్యాల అఖిల, సామ హర్షవర్ధన్‌రెడ్డి, గుడిపెల్లి లక్ష్మి, రాంచంద్రాపూర్ గ్రామానికి చెందిన బోలుమల్ల శ్రద్ధ ఎంపికయ్యారన్నారు.

నంగునూరు(సిద్దిపేట): నంగునూరు మండలం నుంచి 40 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ దేశిరెడ్డి ప్రకటనలో తెలిపారు. నంగునూరు ఉన్నత పాఠశాల నుంచి 13 మంది, అక్కేనపల్లి మోడల్ స్కూల్ నుంచి 11 మంది, అంక్షాపూర్ నుంచి ఆరుగురు, నర్మేట నుంచి ఐదుగురు, మగ్దుంపూర్ నుంచి నలుగురు, గట్లమల్యాల పాఠశాల నుంచి ఒక్క విద్యార్థి ఎంపికయ్యాడని పేర్కొన్నారు. దీంతో ఎంఈఓ, ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

దుబ్బాకరూరల్: అక్బర్‌పేట–భూంపల్లి మండలంలోని పోతారెడ్డిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు దీప్తి, శ్రావ్య, శ్రీజ, స్పందన, హన్సిక, జ్యోతిక ఎంపికైనట్లు పాఠశాల సిబ్బంది తెలిపారు. అదేవిధంగా మండలంలోని గంభీర్‌పూర్ జెడ్పీ హెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థి జంగ ప్రణతి ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది.

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలం నుంచి ట్రిపుల్ ఐటీకి 47 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఎంఈఓ దేశిరెడ్డి తెలిపారు. జిల్లాలో మండలం మొదటి స్థానంలో నిలిచినందుకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు హర్షం వ్యక్తం చేశారు.

సిద్దిపేటరూరల్: మండల పరిధిలోని ఇర్కోడ్ ఆదర్శ పాఠశాలకు చెందిన 27 మంది విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ బుచ్చిబాబు తెలిపారు. అదేవిధంగా నారాయణరావుపేట మండల పరిధిలోని జక్కాపూర్ గ్రామానికి చెందిన ఉన్నత పాఠశాల విద్యార్థులు 10 మంది, ఎన్సాన్‌పల్లి గురుకుల పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. దీంతో హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఉపసర్పంచ్ చెక్‌పవర్ రద్దుపై స్టే

చిన్నకోడూరు(సిద్దిపేట): మండలంలోని చర్లఅంకిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ జెల్ల రవీందర్ చెక్ పవర్‌ను రద్దు చేస్తూ కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలపై బాధితుడు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. ఈ మేరకు న్యాయస్థానం జెల్ల రవీందర్ చెక్ పవర్ రద్దుపై స్టే అమలు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను సోమవారం కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారులకు అందజేసి, తన చెక్ పవర్ పునరుద్ధరించాలని కోరినట్లు రవీందర్ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **రెవెన్యూ డివిజన్ సాధన గ్రామ కమిటీ ఎన్నిక**

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధనకు మండల వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కమిటీల్లో భాగంగా సోమవారం మండల పరిధిలోని దొమ్మాటలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. డివిజన్ సాధన జేఏసీ మండల కన్వీనర్ బొమ్మగాని అంజయ్యగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికలో జేఏసీ గ్రామ కన్వీనర్‌గా మంచెర్ల మోహన్‌రెడ్డి, కో–కన్వీనర్‌గా వెలుగుల కనకయ్య, కార్యదర్శిగా గుజ్జుల శ్రీనివాస్‌రెడ్డి, సభ్యులుగా పచ్చిమడ్ల రాజు, లింగాల కనకయ్య, కొండపాక బాల్‌నర్సు, గుజ్జుల తిరుపతిరెడ్డి, మంచర్ల తిరుపతిరెడ్డి, ఒగ్గు నర్సింహులు, గుజ్జుల భరత్‌రెడ్డి, గుజ్జుల వీరంరెడ్డి, పోలోజు సీతారాములు ఎన్నికయ్యారు.

◆ **పేదలకు సేవలు చేయడంలోనే తృప్తి**

దుబ్బాక: పేదలకు సేవ చేయడంలోనే తృప్తి కలుగుతుందని దుబ్బాక సత్యసాయి సేవ కమిటీ కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం గురుపౌర్ణమి పురస్కరించుకొని దుబ్బాక వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ హేమరాజ్‌సింగ్‌తో కలిసి రోగులకు పండ్లు, బ్రెడ్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజమౌళి పంతులు, భజన కమిటీ సభ్యులు, ఆస్పత్రి సిబ్బంది తదితరులున్నారు.

◆ **ఆర్థికసాయం**

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి బ్యాచ్‌మేట్ హోంగార్డ్స్ ఆర్థికసాయం అందజేశారు. సిద్దిపేట ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న గుండప్ప జూన్ 28వ తేదీన సంగారెడ్డి చక్రియాల శివంపేట్ రోడ్డులో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న 2010 బ్యాచ్‌కు చెందిన తోటి హోంగార్డులు మృతుడి కుటుంబానికి సంగారెడ్డిలో సోమవారం రూ.55,600లు అందజేశారు.

◆ **కళాశాలలో వసతులు కల్పించాలి**

కొండపాక(గజ్వేల్): కొండపాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నెలకొన్న సమస్యలపై బహుజన ప్రజాస్వామ్య విద్యార్థి సమాఖ్య (బీడీఎస్ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం సర్వే చేశారు. ఈ సందర్భంగా బీడీఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దబ్బెట ఆనందర్ మాట్లాడుతూ.. జూనియర్ కళాశాలలో అధ్యాపకులు, అటెండర్ లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వివిధ గ్రామాల నుంచి 200 మంది విద్యార్థులు కళాశాలకు వస్తుంటారని కాలేజీ ఎదుట రిక్వెస్టు ఆర్టీసీ బస్టాప్ లేక దూరంలో బస్సు దిగి కాలినడకన వస్తున్నారన్నారు. క్రీడా సామాగ్రి సరిగా లేవన్నారు. ప్రభుత్వం వెంటనే వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.

◆ **మట్టి అక్రమ రవాణాకు అధికారుల అండ**

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్) ఊర చెరువు నుంచి నల్లమట్టిని అక్రమంగా ఇటుక బట్టీలకు తరలిస్తున్న రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని సర్పంచ్ బత్తిని సాయిలు సోమవారం ఆరోపించారు. అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినా పట్టించుకోవడం లేదన్నారు. రెవెన్యూ అధికారుల అండతోనే కంసాని కుంటను పూడ్చి వేస్తున్నారని, చెరువు మట్టి ఇటుక బట్టీలకు తరలించిన అధికారులు ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు.

◆ **సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత**

చేర్యాల(సిద్దిపేట): పట్టణ కేంద్రానికి చెందిన చాట్ల ప్రసాద్‌కు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.50వేల చెక్కును ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి చేతుల మీదుగా అందించారు. ఆయన వెంట కౌన్సిలర్ నరేందర్, 4 మండలాల యూత్ ఇన్‌చార్జి అంజయ్య తదితరులున్నారు.

◆ **మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి**

సిద్దిపేటకమాన్: మున్నూరుకాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ.5వేల కోట్ల నిధులు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దేవయ్య అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు రాసిన ఉత్తరాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాల్లో మున్నూరుకాపు విద్యార్థులకు హాస్టల్ భవనం నిర్మించేందుకు ఎకరా స్థలాన్ని కేటాయించి నిధులు కేటాయించాలన్నారు. కార్యక్రమంలో ఎల్లయ్య, శ్రీనివాస్, యాదగిరి, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ప్రిన్సిపాల్‌కు ఘనంగా వీడ్కోలు**

వర్గల్(గజ్వేల్): వర్గల్ మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ బదిలీ అయిన డాక్టర్ వెంకటేశ్వర్‌రావును గురుకుల ప్రస్తుత ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి జ్ఞాపిక అందజేశారు. సోమవారం గురుకులంలో నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

◆ **వాటర్‌మెన్‌గా కొనసాగించాలి**

మద్దూరు(హుస్నాబాద్): తనపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని వాటర్‌మెన్ ఎంపీఓను వేడుకున్నాడు. చేర్యాల మండలంలోని కమలాయపల్లి గ్రామానికి చెందిన ఎల్లయ్య వాటర్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. తనను యథావిధిగా వాటర్‌మెన్‌గా కొనసాగించాలని సోమవారం ఎంపీఓకు వినతిపత్రం అందించారు. 25 సంవత్సరాలుగా వాటర్‌మెన్‌గా పని చేస్తున్నానని, గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానాల్లో వాటర్‌మెన్‌గా నియమితులైన నన్ను ప్రస్తుత సర్పంచ్ ఓరుగంటి అంజయ్య వాటర్‌మెన్‌గా పని చేయొద్దని బెదిరిస్తున్నాడని ఎల్లయ్య వినతిలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్‌డబ్ల్యూఎస్ వాటర్‌మెన్‌గా పని చేస్తున్నానని ఎలాంటి కారణం లేకుండా సర్పంచ్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని ఆరోపించారు. కావునా వాటర్‌మెన్‌గా కొనసాగించాలని ఆయన ఎంపీఓను వేడుకున్నాడు.